# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

క్రైస్తవ మాసపత్రిక

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు-మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవుసరం!!

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

Editor :
J. C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంచిక 2 సెప్టెంబరు 1986 సంపుటి 7


## సంపాదకీయము

### మంచి హృదయాలు చెడు హృదయాలు

*(Good and Bad Hearts)*

మంచి చెడు హృదయాలనుగూర్చి తలంచునప్పుడు మనం సాధారణంగా భౌతిక గుండెనుగూర్చి ఆలోచిస్తాము. మనకు వయస్సు పెరిగే కొలదీ శరీరంలోని ఈ అవయవాన్ని గూర్చి ఎక్కువ ఆలోచిస్తాము. హృదయాన్నిగూర్చి, రకరకాల హృదయాలనుగూర్చి లేఖనములో ఎక్కువ కనబడతాది. గాని అది రక్తప్రసరణ గావించే గుండె గాక మానవుని మనస్సు, యోచన పద్ధతినిగూర్చి చెబుతుంది. మానవుని హృదయం అంటే అతని మానసిక తత్వం, మనోభావనలని మనం సాధారణంగా ఉద్దేశించి మాట్లాడుతాము.

ఒకని ఆత్మీయ పరిస్థితితో సంబంధములేకయే యున్న మంచి హృదయములున్నవి. మానవులు ఆయా సంగతులనుగూర్చి కలిగి యున్న మనస్తత్వాన్నిబట్టి వారి హృదయం మంచిదనో లేక చెడ్డదనో మనం భావిస్తాము. ఒక వ్యక్తి మంచితనము, దయ, విశాల భావములు

గలిగి నిష్కపటుడై సరియైన దానిని జరిగించాలని ప్రయత్నించుచుం
అతనిది మంచి హృదయమని మనం చెబుతాము. కొందరు అసహ్యుల
పొరుగువారితో కలసిమెలసి యుండక ఎల్లప్పుడు ఏదో ఒకటి సణు
కొనుచునే యుంటారు. అట్టి వారిది చెడుహృదయం అని మన
తలస్తాము.

నా హృదయం ఎట్టిది? యని మనం ప్రశ్నించుకొంటే మంచిది
ఈ విషయంలో మనకు సహాయకరంగా యుండునట్లు లేఖనాల్లో చెప్ప
బడిన కొన్ని హృదయాలను మనం పరిశీలించుదాం :

1. పవిత్ర హృదయాలు: "హృదయ శుద్ధి గలవారు ధన్యులు;
వారు దేవుని చూచెదరు" అని క్రీస్తు చెప్పాడు (మత్త 5:8). "మీర
క్షయబీజమునుండి కాక శాశ్వతమగు జీవముగల దేవుని వాక్య మూ
ముగా అక్షయ బీజమునుండి పుట్టింపబడినవారు గనుక నిష్కపటమైన
సహోదర ప్రేమ కలుగునట్లు మీరు సత్యమునకు విధేయులవుట చే
మీ మనస్సులను పవిత్రపరచు కొనినవారై యుండి యొకనినొకడు
హృదయపూర్వకముగాను మిక్కుటముగాను ప్రేమించుడి" యని
పేతురు చెప్పాడు (1 పేతురు 1:22, 23). ఈ వచనములనుబట్టి ఒకడు
ప్రభువుకు విధేయుడగుటద్వారా అతని హృదయం పవిత్రపరచబడునని,
పవిత్ర హృదయం కలిగియుండుటవలన దేవుని చూడగలమని, లేదా
ఆయనతో యుండగలమని తెలిసికొనగలము.

2. కఠిన హృదయం : ఇట్టి హృదయం కలిగినవానికి ఏమీ
చెప్పలేము. అట్టివాడు మొండివాడు, ఏమిచెప్పినా వినడు, ఆలో
చించడు, దయ చూపించడు. మోషే ధర్మశాస్త్ర కాలములో
జీవించుచు కఠిన హృదయాలు కలిగినవారిని గూర్చి, అంటే తమ
యిష్టమొచ్చినట్లు ప్రవర్తించేవారిని గూర్చి క్రీస్తు చెప్పాడు. నేడు
కూడ ఒకడు తానానుసరిస్తున్న భక్తిమార్గాన్ని (సంఘాన్ని) గూర్చి

దేవుని వాక్యంలో ఎక్కడా కనుగొనకపోయినను, కుటుంబసభ్యులను గూర్చి లేక మరేదైనా కారణాన్ని గూర్చి అదేమార్గాన్ని అవలంభిస్తూ మార్పునొందడానికి ఇష్టపడకపోతుంటే అతడు కఠిన హృదయుడని మనం చెప్పుకోవచ్చు. ఒకడు తన హృదయాన్ని గట్టిపరచుకొని తన పొరబాటులోనే జీవిస్తూయుంటే అది చాలా ప్రమాదకరం. అట్టివాడు మార్పుజెందుట చాలా కష్టము. "పాపము వలన కలుగు భ్రమ చేత మీలో ఎవడును కఠినపరచబడకుండునట్లు - నేడు అనబడు సమయ ముండగనే ప్రతి దినమును ఒకనికొకడు బుద్ధి చెప్పుకొనుడి" యని హెబ్రీ పత్రిక లేఖకుడు హెచ్చరించాడు (హెబ్రీ 3:13).

3. విశ్వాసం లేని హృదయాలు : "సహోదరులారా, జీవము గల దేవుని విడిచిపోవునట్టి విశ్వాసములేని దుష్ట హృదయము మీలో ఎవనియందైనను ఒకవేళ ఉండునేమో అని జాగ్రత్తగా చూచుకొనుడి" యని దైవప్రేరిత లేఖకుడు చెప్పాడు (హెబ్రీ 3:12). అవిశ్వాసము నాశనానికి నడుపుతాది. "నమ్మనివానికి శిక్ష విధింపబడు నని" క్రీస్తు చెప్పాడు (మార్కు 16:16). అయితే వినుట వలన విశ్వాసము కలుగునని పౌలు చెప్పుచున్నాడు (రోమా 10:17). నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును (రోమా 10:10). ఐతియోపియా నపుంసకుడు హృదయపూర్వకముగా విశ్వసించిన యెడల క్రీస్తులోనికి అతడు బాప్తిస్మము పొందవచ్చునని ఫిలిప్పు చెప్పాడు (అపొ.కా. 8:37). అతడు తన విశ్వాసాన్ని ఒప్పుకొనగా ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చాడు.

4. మార్పు పొందని హృదయం : పౌలు ఇట్లు చెప్పాడు : "నీ కాఠిన్యమును మార్పు పొందని నీ హృదయమును అనుసరించి ఉగ్రత దినమందు, అనగా దేవుని న్యాయమైన తీర్పు బయలుపరచబడు దినమందు నీకు నీవే ఉగ్రతను సమకూర్చుకొనుచున్నావు"

(రోమా 2:5). "లోపలనుండి అనగా మనుష్యుల హృదయములో నుండి దురాలోచనలును జారత్వములును దొంగతనములును నరహత్య లను వ్యభిచారములును లోభములును చెడుతనములును కృత్రిమ మును కామవికారమును మత్సరమును దేవదూషణమును అహంభావ మును అవివేకమును వచ్చును. ఈ చెడ్డవన్నియు లోపలినుండియే బయలువెళ్ళి మనుష్యుని అపవిత్రపరచునని" క్రీస్తు చెప్పాడు (మార్కు 7:21-23). అందువలననే మానవుడు మారుమనస్సు పొందాలని లేక పోతే నశిస్తాడని ప్రభువు ఆజ్ఞాపించాడు (లూకా 13:3). మారుమనస్సు పొందినవారు పాపక్షమాపణ నిమిత్తం ప్రభువుకు విధేయత నూతన స్థితిలో యుంటారు (అపొ.కా. 2:38). మారుమనస్సు పొందనొల్లని వారు నశిస్తారు.

5. ఏక హృదయులు : దేవునికి విధేయులైన వారందరు ఏక హృదయులవుతారు. వారు ఒకే ఆజ్ఞలకు లోబడుటవలన ఏకము చేయ బడ్డారు. వారు క్రీస్తునందు, ఆయన సంఘమునందు ఏకము చేయ బడుట వలన ఒండొరులకు సహాయపడుట కిష్టపడుదురు (అపొ.కా. 4:32). యిది ఏకత్వము. లేఖనములద్వారా కలిగిన ఐక్యత (యోహాను 17; I కొరింథి 1:10).

6. అంధ హృదయం : ఎఫెసులో యున్న క్రైస్తవులు అన్యజనులవలె నడుచుకొనరాదని పౌలు చెప్పాడు. "వారైతే అంధ మైన మనస్సు గలవారై తమ హృదయ కాఠిన్యము వలన తమలో నున్న అజ్ఞానముచేత దేవుని వలన కలుగు జీవములోనుండి వేరుపరచ బడినవారై తమ మనస్సునకు కలిగిన వ్యర్థత అనుసరించి నడుచుకొను చున్నారు. వారు సిగ్గులేనివారై యుండి నానావిధమైన అపవిత్రతను అత్యాశతో జరిగించుటకు తమ్మును తామే కాముకత్వమునకు అప్ప గించుకొనిరి" (ఎఫెసీ 4:18, 19). మోసపర్చబడిన హృదయం దీనితో

సమానమైనది. యాకోబు ఇట్లనుచున్నాడు: "ఎవడైనను నోటికి కళ్లెము పెట్టుకొనక తన హృదయమును మోసపరచుకొనుచు భక్తి గలవాడనని అనుకొనిన యెడల వాని భక్తి వ్యర్థమే" (యాకో 1:26).

7. విధేయత గల హృదయం: మనము హృదయపూర్వకముగా ఆయనకు లోబడాలని ప్రభువు కోరుచున్నాడు (రోమా 6:17, 18). మనం పూర్ణ హృదయముతో ఆయనను ప్రేమించాలి (మత్త 22:36, 37). పౌలు ఇట్లు హెచ్చరించాడు: "మనుష్యులను సంతోష పెట్టువారు చేయునట్లు కంటికి కనబడుటకే కాక క్రీస్తు దాసులమని యెరిగి, దేవుని చిత్తమును మనఃపూర్వకముగా జరిగించుచు మనుష్యులకు చేసినట్టు కాక ప్రభువునకు చేసినట్టే యిష్టపూర్వకముగా చేయుడి ... మీలో ప్రతివాడును ఏ సత్కార్యము చేయునో దాని ఫలము ప్రభువు వలన పొందునని మీరెరుగుదురు" (ఎఫెసీ 6:6-8).

ఇంతేగాక లేఖనాల్లో అనేక హృదయాలు వర్ణించబడినవి. అవి ఏమని పిలువబడినను ఆలోచించేవి, ఏదైనా పనిచేయుటకు లేక చేయకుండుటకు, విధేయత చూపుటకు లేక చూపకుండుటకు, ఆరాధించుటకు లేదా ఆరాధించకుండుటకు, సేవించుటకు లేదా సేవింపకుండుటకు పురికొల్పేవి అవే యని మనం గమనించాలి. అవి అంగీకరిస్తాయి, నిరాకరిస్తాయి, మంచివి, చెడ్డవి, నీతిగలవి, నీతిలేనివి మొదలగునవి. ఒకనికున్న హృదయాన్నిబట్టి అతడు రక్షింపబడునో లేక నశించునో నిర్ణయించబడతాది.

నీకున్న హృదయం ఎట్టిది? అది విశాల హృదయమా? దయార్ద్ర హృదయమా? కదలింపబడేదా? వినేదా? అది నిష్కపటమైనదా? ప్రేమించునదా? దయగల హృదయమా? నీకుండవలసిన హృదయాన్ని నీవే నిర్ణయించుకోగలవని గుర్తుంచుకో. అదొక అవిశ్వాస హృదయమైతే దేవుని వాక్యాన్ని అంగీకరించుటద్వారా దాన్ని

విశ్వాస హృదయంగా మార్చుకోవచ్చును. అవాక చెడ్డ హృదయమైతే క్రీస్తు చిత్తానికి లోబడి క్రీస్తు సారూప్యములోనికి మారుచు మంచి హృదయం కాగలదు. నీవు క్రీస్తును నమ్మకంగా అనుసరించు వాడవని, మంచి హృదయుడవని నిన్ను గూర్చి ప్రజలు చెప్పగలిగితే దానికి మించిన అభినందన ఇంకేమున్నది ?

---

## రాజ్యమును మొదట వెదకుడి

(గత సంచిక తరువాయి)

### రాజ్యము స్థాపింపబడెను

"ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు, మనుష్య కుమారుడు తన రాజ్యముతో వచ్చుట చూచువరకు మరణము రుచిచూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" (మత్తయి 16 : 28). దీన్ని బట్టి క్రీస్తు యొక్క బోధలు విన్న వారిలో కొందరు బ్రతికియుండగానే రాజ్యము స్థాపింపబడింది. రాజ్యము స్థాపింపబడకపోతే క్రీస్తుయొక్క బోధలు విన్న వారిలో కొందరు భూమిమీద యింకా జీవించియుండాలి. "ఆయన – ఇక్కడ నిలిచియున్నవారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచి చూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" (మార్కు 9:1). ఈ వాక్య ప్రకారము దేవుని రాజ్యము శక్తితో వచ్చియుండాలి. "నా తండ్రి వాగ్దానము చేసినది మీకు పంపుచున్నాను. మీరు (అపొస్తలులు) పైనుండి శక్తి పొందువరకు (యెరూషలేము) పట్టణములో నిలిచియుండుడి" (లూకా 24:49). "మీరు యెరూషలేము విడిచి వెళ్ళక నా వలన వినిన తండ్రియొక్క వాగ్దానము కొరకు కనిపెట్టుడి;...... మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందుదురు" (అపో.కా.1:4, 5).

తండ్రి వాగ్దానము పరిశుద్ధాత్మ; పరిశుద్ధాత్మ వచ్చినపుడు అపొస్తలులు శక్తిపొందుదురు; రాజ్యము శక్తితో వస్తాది. "ఈ యేసును దేవుడు లేపెను..., ఆయన దేవుని కుడిపార్శ్వమునకు హెచ్చింపబడి, పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానము పొంది, మీరు చూచుచు వినుచున్న దీనిని కుమ్మరించియున్నాడు" అని పేతురు బోధించాడు (అపొ.కా. 2:32, 33). అంటే, 12 మంది అపొస్తలులు పెంతెకొస్తు దినమున పరిశుద్ధాత్మ శక్తి పొందగానే, రాజ్యము అద్భుతరీత్యా స్థాపింపబడింది. అదియే క్రీస్తు సంఘము (అపొ.కా. 2:1-4).

## రాజ్యము, సంఘము ఒక్కటే

1. "నేను ఈ బండ మీాద నా సంఘమును కట్టుదును;...పరలోక రాజ్యము యొక్క తాళపుచెవులు నీకిచ్చెదను" (మత్తయి 16:18, 19) అని క్రీస్తు పేతురుతో అన్నాడు. ఆయన కట్టేది సంఘమయితే, దానిలో ప్రవేశింపగోరువారికి సంఘము యొక్క తాళపు చెవులు యివ్వాలి. గాని రాజ్యముయొక్క తాళపుచెవులు యిస్తానన్నాడు. అంటే రాజ్యము - సంఘము ఒకే దాన్ని సూచిస్తూ వాడబడిన పర్యాయపదములు.

2. "...దేవుని రాజ్యము మీా యొద్ద నుండి తొలగింపబడి, దాని ఫలమిచ్చు జనుల కియ్యబడును" (మత్తయి 22:43) అని కీర్తనలు 118:22, 23ను ప్రస్తావిస్తూ క్రీస్తు బోధించాడు. ఇదే వాక్యాన్ని పేతురు అపొ. 4:11లోను, I పేతురు 2:7లోను ఎత్తి చెబుతూ సంఘములో ప్రవేశించని యూదులను హెచ్చరించాడు. గనుక రాజ్యము, సంఘము ఒక్కటే యని నిర్థారణ యగుచున్నది. ఇది తిరుగులేని వాస్తవము.

3. కొలస్స పట్టణమందున్న క్రైస్తవులు క్రీస్తులో, ఆయన రాజ్యములో, ఆయన శరీరమైన సంఘమందు యుండిరి (కొలస్స 1:13,

18, 24). సంఘము — రాజ్యము ఒక్కటే కానట్లయితే యిదె
సాధ్యమౌతాది ?

| | | |
|---|---|---|
| రాజ్యము | — | సంఘము |
| రాజ్యనివాసులు | — | క్రైస్తవులు |
| రాజు | — | క్రీస్తు |
| రాజ్యాంగము | — | క్రొత్త నిబంధన |

## రాజ్యము – రాజు – రాజ్యనివాసులు

1. "దేవుని రాజ్యము మాటలతో కాదు శక్తితోనే యున్నది"
(1 కొరింథీ 4:20).

2. "అన్యాయస్థులు దేవుని రాజ్యానికి వారసులు కారు"
(1 కొరింథీ 6:9). "వ్యభిచారియైనను అపవిత్రుడైనను విగ్రహారాధి
డైనను క్రీస్తుయొక్కయు, దేవుని యొక్కయు రాజ్యమునకు హక్కు
దారుడు కాడు" (ఎఫెసీ 5:5).

3. "క్రీస్తు మనలను ప్రేమించి తన తండ్రియగు దేవునికి ఒక
రాజ్యముగాను యాజకులనుగాను చేసెను" (ప్రకటన 1 : 6). "మా
దేవునికి వారిని ఒక రాజ్యముగాను యాజకులనుగాను చేసితివి" (ప్రక
టన 5:14). అందుకనే పేతురు క్రైస్తవులను "ఏర్పరచబడిన వంశ
మును రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని
సొత్తయిన ప్రజలైయున్నారు" అన్నాడు (1 పేతురు 2:9).

4. "మీ సహోదరుడను...రాజ్యములో...పాలివాడను" అని
అపొస్తలుడైన యోహాను చెప్పాడు (ప్రకటన 1 : 9). రాజ్యము
స్థాపింపబడి యున్నది. కాబట్టే యోహాను దానిలో భాగస్తుడు
కాగలిగాడు.

5. "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారము

నుండి విడుదల చేసి తాను ప్రేమించిన తన ప్రియ కుమారుని యొక్క
రాజ్యనివాసులనుగా చేసెను" (కొలస్స 1:13). అపొస్తలుడైన
పౌలుతో సహా మొదటి శతాబ్దమందలి క్రైస్తవులందరు రాజ్యనివా
సులై యుండిరని ఈ వాక్యము బోధిస్తున్నది. రాజ్యము లేకుండ
వారెట్లు రాజ్యనివాసులైరి? రాజ్యనివాసులనుగా చేస్తాడు అని చెప్ప
లేదుగాని రాజ్యనివాసులనుగా చేసెను అని అన్నాడు.

6. "దేవుని రాజ్యము భోజనమును పానమును కాదుగాని,
నీతియు సమాధానమును పరిశుద్ధాత్మ యందలి ఆనందమునై యున్నది"
(రోమా 14:17). ఆహార విషయమైన సమస్య వచ్చినపుడు దేవుని
రాజ్యము ఆధ్యాత్మిక సంబంధమైనదని బోధిస్తూ పౌలు ఈ మాటలు
అన్నాడు.

7. "నిశ్చలమైన రాజ్యము పొంది, దైవకృప కలిగి యుందము;
ఆ కృపకలిగి వినయ భయభక్తులతో దేవుని సేవ చేయుదము" (హెబ్రీ
12:28). ఈ వాక్యాన్ని గమనిస్తే ముందుగా రాజ్యము పొంది, దైవ
కృపకలిగి సేవ చేద్దాము అన్నాడు. రాజ్యములో యుండి సేవచేయాలి.
అంతేగాని సేవచేసిన తర్వాత రాజ్యమురాదు.

8. "ఆ సర్వాధిపతి రాజులకు రాజు ప్రభువులకు ప్రభువునై
యున్నాడు" (1 తిమోతి 6:15). క్రీస్తు పునరుత్థానుడైన తరువాత
వచ్చిన పెంతెకొస్తు దినమున రాజ్యము స్థాపింపబడి, రాజైన క్రీస్తుచే
పరిపాలింపబడుచునే యున్నది.

9. "నీ రాజ్యము వచ్చును గాక" (మత్తయి 6:10) అని
రాజ్యము స్థాపింపబడక మునుపు క్రీస్తు నేర్పించిన ప్రార్థనను, కొందరు
నేటికిని వల్లిస్తూంటారు. రాజ్యము స్థాపింపబడి, రాజైన క్రీస్తుచే
పాలింపబడుచున్నదని యిన్ని లేఖనములు బోధిస్తుండగా, రాజ్యము
వచ్చుగాక యని ప్రార్థించడం వ్యర్థం.

## రాజ్యములోనికి ప్రవేశము

రాజ్యము నేడు ఉన్నది గనుక రాజ్యములోనికి ప్రవేశించుట యెట్లు? "యేసు ఇట్లనెను—ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 3:5).

"ఆయన తాను సృష్టించిన వాటిలో మనము ప్రథమ ఫలముగా ఉండునట్లు సత్యవాక్యము వలన మనలను తన సంకల్ప ప్రకారము కనెను" (యాకోబు 1:18). అంటే దేవుని వాక్యమును బట్టి క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినవాడే, దేవుని రాజ్యములో ప్రవేశింపగలడు.

నీవు దేవుని రాజ్యమైన క్రీస్తు సంఘములో యున్నావా? లేక రాజ్యమునకు వెలుపట యున్నావా? ఒకసారి క్రీస్తుతో సంభాషించిన శాస్త్రిని - "నీవు దేవుని రాజ్యమునకు దూరముగ లేవు" అని క్రీస్తు అన్నాడు (మార్కు 12:34). అట్లనే నీవున్నావా? క్రీస్తు రాజ్యములో పాలివాడవు కాగోరుచున్నట్లయితే ఆయన్ని విశ్వసించి, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది, క్రీస్తును నోటితో ఒప్పుకొని, ముంచడము పొందు; అప్పుడు మాత్రమే నీవు రాజ్యములో ప్రవేశింపగలవు; రాజ్యములో పాలివాడవు కాగలవు; రాజ్యమందున్న దీవెనలు అనుభవించగలవు.

రాజ్యములో ప్రవేశించిన తరువాత ఏమి చేయాలి?

## నీతిని వెదకుడి

ఈ పాఠమునకు మూలవాక్యముగా తీసికొన్న మత్తయి 6:33 నందున్న రెండవ విషయము - "నీతిని వెదకుట". ఒకడు రాజ్యములోనికి ప్రవేశించిన పిమ్మట నీతిని వెదకాలి.

అందుకనే క్రీస్తు యిట్లన్నాడు: "నీతి కొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు, వారు తృప్తిపరచబడుదురు" (మత్తయి 5:6). నీతి

అంటే దేవుని ఆజ్ఞలే (కీర్తనలు 119:172). జీవాహారమైన వాక్యాన్ని భుజించి ఆధ్యాత్మిక ఆకలిని (మత్తయి 4:4; యోహాను 6:51), జీవ జలమైన వాక్యమును త్రాగి దాహమును తీర్చుకొనాలి (యోహాను 4:9-14).

"నీతి యావత్తు నెరవేర్చుట ఈలాగు మనకు తగియున్నది" (మత్తయి 3:15). నీతిని నెరవేర్చుట అంటే దేవుని సమస్త ఆజ్ఞలు పాటించుట (ద్వితీ 6:25). "నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" (మత్తయి 28:20). "...క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి" (గలతీ 6:2). "......పరిశుద్ధత కలుగుటకై యిప్పుడు మీ అవయవములను నీతికి దాసులుగా అప్పగించుడి" (రోమా 6:19). క్రీస్తు మీలో నున్న యెడల మీ శరీరము పాప విషయమై మృతమైనది గాని మీ ఆత్మ నీతి విషయమై జీవము కల్గి యున్నది" (రోమా 8:10).

రాజ్యములో యుండి దేవుని సమస్త ఆజ్ఞలు గైకొన్నట్లయితే మనమేమౌదుము?

## రెండవ రాకడలో రాజ్యము ?

"...క్రీస్తు వచ్చునపుడు ఆయనవారు బ్రతికింపబడుదురు; తరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యమును అప్పగించును. అప్పుడు అంతము వచ్చును" (1 కొరింధీ 15:23, 24). క్రీస్తు యిప్పుడు ఏలుచున్న రాజ్యాన్ని రెండవ రాకడలో తండ్రి వశము చేస్తాడు అని బైబిలు బోధిస్తుంటే, రెండవ రాకడలో రాజ్యము స్థాపించబడతాది అని అబద్ధ బోధకులు ప్రకటిస్తున్నారు.

"మనుష్యు లొక్కసారే మృతినొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27). "ప్రభువుదినము దొంగ

వచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహా ధ్వనితో గతించి పోవును. పంచభూతములు మిక్కుటమైన వేండ్రముతో లయమైపోవును భూమియు దాని మీదనున్న కృత్యములును కాలిపోవును. ఇవన్నియు ఇట్లు లయమై పోవునవి గనుక ఆకాశములు రవులుకొని లయమైపోవు నట్టియు, పంచభూతములు మహా వేండ్రముతో కరిగిపోవునట్టియు దేవుని దినపు రాకడకొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో అపేక్షించుచు మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగల వారై యుండవలెను" (2 పేతురు 3:10-12). రెండవ రాకడలో భూమి లయమై పోతాదని బైబిలు బోధిస్తుంటే, రెండవ రాకడలో యెరూషలేమునుండి క్రీస్తు పాలిస్తాడని అబద్ధికులు బోధిస్తున్నారు దేవుని వాక్యానికి వారి బోధకు ఎంత వ్యత్యాసం?

## ప్రకటన 20 : 1 - 6 బోధించని విషయాలు

ప్రకటన 20:1-6ను ఆధారముగా తీసుకొని చేస్తున్న ఈ క్రింది అబద్ధ బోధలు ఈ వాక్య భాగములో కన్పించవు :

1. క్రీస్తుయొక్క రెండవ రాకడ
2. క్రీస్తు భూమి మీదకు వస్తాడు
3. క్రీస్తు యెరూషలేము నుండి పాలిస్తాడు
4. క్రీస్తు భూమిపై వెయ్యేండ్లు పాలిస్తాడు
5. భౌతిక పునరుత్థానము

ప్రకటన గ్రంథమందలి మిగిలిన భాగము వలెనే ప్రకటన 20:1-6 కూడ అలంకార భాషతో వ్రాయబడింది. తాళపుచెవి, సంకెళ్ళు, ఘట సర్పము, అగాధము, క్రూరమృగము, మొదలగు పదముల వలెనే "1000" అనే సంఖ్య కూడ అలంకారముగా వాడబడి క్రైస్తవుల యొక్క సంపూర్ణ విజయాన్ని, క్రీస్తుతో కూడ వారు చేస్తున్న దీర్ఘకాలపు పాలనను సూచిస్తున్నది.

ఈ వాక్యభాగము బోధిస్తున్న సత్యములు: ఈ లోకములో సాతాను యొక్క ప్రభావము సంపూర్తిగా తొలగిపోలేదు; క్రీస్తు వాక్యము ఎక్కడ ప్రకటింపబడునో అక్కడ సాతాను యొక్క ప్రభావము క్షీణించిపోతాది; క్రీస్తు విషయమై శ్రమ పొందుట శ్రేయస్కరము, ఎందుకంటే క్రీస్తు విజయశాలి గనుక క్రైస్తవులు చివరికి జయము పొందుతారు; తీర్పు జరగనై యున్నది; సాతానుడు నరకములో వేయబడతాడు.

## వెయ్యేండ్ల పాలనలు ఎన్ని ?

ప్రకటన 20:1-6 వచనములు జాగ్రత్తగా చదివితే 4వ వచనములో "వారు...వెయ్యి సంవత్సరములు రాజ్యము చేసిరి" అని, 6వ వచనములో "వీరు...వెయ్యి సంవత్సరములు రాజ్యము చేయుదురు" అని ఉన్నది. వీటిని బట్టి వెయ్యేండ్ల పాలన ఒకటి కాదు సుమా! రెండు!

ఒకవేళ, అబద్ధ బోధకుల ప్రకారము 1000 సం॥ల పాలనను అక్షరార్థముగా తీసికొన్నా కూడ 1000 సం॥ల పాలనలు రెండు జరగాల్సి యుంది! ప్రకటన 20:1-6ను ఆధారముగా తీసుకొని వెయ్యేండ్ల పాలన రానై యున్నది అని బోధించే బోధకులు యిపుడేమి జవాబు యిస్తారు? వారి అబద్ధ బోధ తప్పు అనటానికి ఇంతకంటె రుజువేం కావాలి?

—ప్రభుదాస్ సబ్బతి,
క్రీస్తు సంఘము, ఔరంగాబాద్.

---

## ఎందుకు బాధపడతారు?

ఎవరైనా మీ నాన్న పేరేంటి? అని అడిగితే ధైర్యముగా చెప్పేస్తారు. మీ ఇంటి పేరు? అని అడిగితే సంతోషముగా చెప్పేస్తారు.

ఈ విషయంలో సిగ్గుపడరు, బాధపడరు, ఏమియు అనుకోరు కాని ఆత్మీయ విషయాలలో చూస్తే ఎవరైనా మీరు క్రైస్తవులా యని అడిగితే, క్రైస్తవులము అని చెప్పుకోవటానికి సిగ్గుపడి వినిపించుకోనట్లు ఏదో కబుర్లు చెప్పేస్తారు.

సినిమా పుస్తకాలుగాని, నవలలుగాని, మరియేయితర పుస్తకాలుగాని తీసుకొని వెళ్లుటకు సిగ్గుపడరు, భయపడరు. గాని జీవ గ్రంథమైన బైబిలును వెంటబెట్టుకొని వెళ్లుటకు సిగ్గుపడతారు, భయపడతారు.

ఎందుకు సిగ్గుపడాలి? క్రీస్తుప్రభువు అంటే అంత హీనమైనవాడా! బైబిలు సినిమా పుస్తకాల కన్నా, నవలల కన్నా హీనమైనదా? క్రైస్తవులము అన్న పేరు పెట్టుకొని సిగ్గుపడుతున్నవారు క్రైస్తవులా? లేక క్రీస్తు విరోధులా?

క్రీస్తును 30 వెండిరూకలకు ఆశపడి ఇస్కారియోతు యుదా అమ్మివేసాడు. పేతురుగూడా తన ప్రాణమును రక్షించుకొనగోరి, క్రీస్తు ప్రభువు నాకు తెలియదని యూదులతో అబద్ధమాడి క్రీస్తును ఎరుగనన్నాడు (మార్కు 14:30, 66, 68) మనం కూడా ఈ పనేచేస్తున్నాం గదా! ఉదరపోషణ కొరకు, స్కాలర్ షిప్‌ల కొరకు ఉద్యోగము కొరకు ఏవేవో పేర్లు పెట్టుకొని ఎటు వీలుపడితే అటు మార్చుకొంటారు. ఆ రోజుల్లో క్రీస్తును యూదులు హింసించినారు, ఈ రోజుల్లో క్రైస్తవులు అని వ్యవహరింపబడుతున్నవారు క్రీస్తును సిలువ వేస్తున్నారు. ఎంతటి విషాదకరమైన విషయం!

మత బోధకులే పర్వాలేదని తప్పుడు బోధ చేస్తుంటే, అమాయకులు ఏమిచేస్తారు?

అందుకే క్రీస్తు ప్రభువు ఈలా అన్నారు. వేషధారులారా పరిసయ్యులారా శాస్త్రులారా మీరు పళ్ళెమును వెలుపట శుద్ధి

చేయుదురు గాని, లోపట దోపుతోను, అజితేంద్రియముతోను నిండి నిండి యున్నారు (మత్తయి 23:25). మేము మంచివారము అంటూ వీరి స్వంత సిద్ధాంతములను తయారు చేసికొని బోధిస్తున్న వీరిని దేవుడు వేషధారులని పిలుస్తాడా, లేక భళా నమ్మకమైనవాడవని పిలుస్తాడా! బైబిలుకన్న మీ విశ్వాస ప్రమాణ పుస్తకాలను గౌరవిస్తున్న మిమ్ములను ఏమని పిలుస్తారో మీరే గమనించండి.

మీ సంఘము (Church) పేరేంటి అని మత నాయకులను అడిగితే, మాదండీ - లూథరన్ అండ్ క్యాథలిక్, పెంతెకొస్తు బాప్టిస్టు అని చెప్పుకోటానికి సిగ్గుపడక ఎంతో ఆనందముగా చెప్పేస్తారు. అసలు బైబిలులో ఈ సంఘాలగురించి ఉందా! ఎందుకండీ బైబిలుకన్నా మానవ సిద్ధాంతాలపైన ఆధారపడి తప్పుడు బోధచేస్తారు! ఎందుకు అబద్ధాలంటే మీకు అంత ఇష్టం! క్రీస్తుకన్న మానవుడు గొప్ప వాడనా మీ ఉద్దేశం!

నా సంఘమును కట్టుదును అని క్రీస్తు స్పష్టముగా చెబుతుంటే (మత్తయి 16:18) ఎందుకు మీరు ఆ వాక్యాన్ని కొట్టివేస్తారు! నరేకాని ఈ తరహా ప్రకారం ఎవరి సంఘముగా పిలువబడాలి! మీరే చెప్పండి. ఇది క్రీస్తు సంఘం కాకుండా ఎందుకు! రోమా 16:16లో "క్రీస్తు సంఘములు" అని ఉందిగదా. ఎందుకు ఈ విషయమై బోధిస్తారు! అన్యాయకులైన ప్రజలను ఎందుకు నాశనం చేస్తారు చెప్పండి. క్రీస్తు సంఘాన్ని స్వరక్తమిచ్చి కొన్నాడు అని ఉంది గదా (అ.కా. 20:28). మరి మీ సంఘం అంటే ప్రభువు సంఘం కొరకు రక్తం కార్చలేదా! ఇంత స్పష్టముగా బైబిలు చెప్పుచుండగా ఎందుకు తప్పుడు బోధ చేయాలి! ఇలాంటివారు క్రీస్తును మరలా సిలువ వేస్తున్నారని మనకు తెలుపుచున్నది (హెబ్రీ 6: 4, 6).

రక్షించబడినవాడు క్రీస్తు నామాన్ని ధరించుకొంటాడు (అ॥కా॥ 1:26). బాప్తిస్మము ద్వారా క్రీస్తును ధరించుకొంటాడు (గలతీ 3:27). క్రీస్తుకు అవయవములై క్రీస్తు శరీరములో, క్రీస్తు సంఘములో క్రీస్తు రాజ్యములో ఉంటాడు (కొలస్స 1:18; కొలస్స 1:13; ప్రకటన 1:9). రక్షింపబడినవాడు మానవకల్పిత సంఘములో ఎలా ఉంటాడు! వేరే సంఘాలలో ఉంటే అతను రక్షింపబడలేదు. యేసు నామం వలననే గాని వేరే నామం వలన రక్షణ లేదు (అ॥కా॥ 4 : 12). క్రీస్తుద్వారా రక్షింపబడినవారు వేరే సంఘంలో ఎందుకు ఉంటారు? బాప్తిస్మం ముంచడమేగాని చిలకరింపు కుమ్మరింపు కాదు (రోమా 6:1-6). నపుంసకుడు ఫిలిప్పు ఇద్దరు నీళ్ళలోనికి దిగిరి. ఫిలిప్పు నపుంసకునికి బాప్తిస్మమిచ్చెను. (అ॥కా॥ 8:38). చిలకరింపుకు నీటిలోనికి దిగవలసిన పని లేదుగదా! ఒకడు రక్షింపబడాలంటే, చిలకరింపు కుమ్మరింపు జండా క్రిందగ వెళ్ళుటద్వారా రక్షింపబడలేడు. బైబిలు అలా బోధించుట లేదు. ఈ విషయాన్ని వింటుంటే ఆశ్చర్యంగా ఉంది. కొందరు బైబిలు చెప్పు బోధ గాక వారి స్వంత సిద్ధాంతాలను బోధిస్తారు.

బైబిలు విషయాలు కల్పినను తీసివేసినను పరలోక రాజ్యంలో పాలుపంపులు లేవు (ప్రక 22:18, 19).

బైబిలు వాక్యాలు గాక, వేరే బోధ ఎవరైనను పరలోకమందున్న దూత ప్రకటించినను శాపగ్రస్తుడు అని గలతి 1:7, 8 లో ఉంది. ఎందుకు భయం లేక స్వంత సిద్ధాంతాలు బోధిస్తారు?

చిన్న పిల్లలకు బాప్తిస్మాలు ఇస్తారు. పాపం కడిగివేసుకొనుటకు బాప్తిస్మం పొందాలి (అ.కా. 22:16 అ.కా. 2:38). వీరు ఏ పాపం చేసారు? పాపం లేనివానికి పాపం ఉన్నదని బోధించటం ఇంతకంటే అబద్ధం మరేముంది?

మన మధ్యవర్తి క్రీస్తు (1 తిమో 2:5). కాని మానవుడు

మధ్యవర్తినని పిలువబడుచున్నాడు. అసలు వీరు దేవునికంటే గొప్ప వారా?

మానవమాత్రులము గనుక తప్పు చేస్తాం. ఆ తప్పులు మన మధ్యవర్తియైన ప్రభువుకు తెలియజేయమని 1 యోహాను 1:9, 10లో ఉంది కాని Father అనే గురువులకు చెవిలో చెప్పాలని ఎక్కడా లేదు. ఈ విషయం మహా విడ్డూరంగా ఉంది. అంత్యక్రీస్తు క్రీస్తు పేరు పెట్టుకొని తప్పుడు బోధ చేస్తున్నారనిపిస్తుంది.

ప్రియ మిత్రులారా, చిలకరింపు కుమ్మరింపు, జెండాక్రిందకు వెళ్ళిన వారలారా, వాక్యానుసారంగా, ముంచటం (బాప్తిస్మము) పొంది, నీ కొరకు నాకొరకు రక్తం కార్చిన తన సంఘములో అనగా క్రీస్తు సంఘములో చేరండి. మానవుని చెవిలోగాక మీ విన్నపాలు మధ్య వర్తియైన ప్రభువుకు తెలియజేయండి.

తప్పుడు బోధనుండి బయటకు వచ్చి నిజసంఘములో చేరండి.

— యం. ఫిలిప్,
క్రీస్తు సంఘం, కారంపూడి.

---

## సొదొమ హెచ్చరిక

### *( The warning of Sodom )*

"లోతు దినములలో జరిగినట్టును జరుగును. జనులు తినుచు త్రాగుచు అమ్ముచు, నారు నాటుచు ఇండ్లు కట్టుచునుండిరి. అయితే లోతు సొదొమ విడిచిపోయిన దినమున ఆకాశము నుండి అగ్నిగంధకములు కురిసి వారినందరిని నాశనము చేసెను. ఆ ప్రకారమే మనుష్య కుమారుడు ప్రత్యక్షమగు దినమున జరుగునని" క్రీస్తు ప్రభువు హెచ్చరించాడు (లూకా 17:28-30).

లోతు దినములలో యున్నట్లే నేడు కూడ మానవ నైజ మున్నది, జీవితమంతా మామూలుగానే కొనసాగిపోవుచున్నది. ఆరోజు కూడ సొదొమ వారు సూర్యుడు యథావిధిగా ఉదయించి తన కాంతి కిరణాలను ప్రసరించుట చూచారు, తమ పనులలోనికి మామూలుగానే పోయారు. రొట్టెలు చేయు వారు రొట్టెలు చేయడానికి, రైతులు తమ పొలములలోనికి, వర్తకులు తమ దుకాణములలోనికి బహుశ వెళ్లి యుండవచ్చును. ఒకే ఒక్క కుటుంబానికి తప్ప ఆరోజు మిగతా వారందరికీ మామూలుగానే ఆరంభమయింది. ఈ ఒక్క కుటుంబము ఒక అసాధారణమైన ప్రయాణాన్ని పెందలకడనే ఆరంభించారు, అది ఒకవైపున మాత్రమే పోయిన ప్రయాణం. వారొక చిన్న పట్టణానికి బయలు దేరారు. అంతకు మించి ఆ రోజులో వేరుగా అప్పటివరకు కనబడింది ఏమీ లేదు.

సొదొమ వాస్తవ్యులు పాపులు, మారుమనస్సు లేనివారు; దేవుడు వారిని నాశనం చేసాడు. అందుకే మానవులందరు మారు మనస్సు పొందాలని హెచ్చరిక చేయబడింది (అపొ.కా. 17 : 30).

దేవునికిని ఆయన వాక్యమునకును దూరముగా ప్రజలు జీవించుచున్న కాలములో ఇప్పుడు మనమున్నాము. గతంలో వలెనే మారు మనస్సు లేనివారిని మనం ప్రతిదినము చూచుచునే యున్నాము. వారు దేవుని ఆజ్ఞలకు లోబడిన వారు కారు; వారి యెడల దేవుని ప్రేమను ఎరిగిన వారు కారు.

సొదొమ వలెనే ఆయన నెరుగని వారి మీదికి నాశనదినము వస్తాది. మృతులగుచున్న లోకములో మనము జీవించుచున్నందున, సజీవుల లోకములో యుండుటకు సిద్ధపడడానికి దేవుడు మనకు కొంత సమయాన్ని ఇప్పటికే ఇచ్చియున్నాడు. ప్రాముఖ్యమైన ప్రశ్న యేమంటే, "రాబోవు లోకము కొరకు మనము సిద్ధపడియున్నామా!

లేదా !". మనము మారుమనస్సు పొందాలి, లేకపోతే నశిస్తామని యేసు చెప్పాడు (లూకా 13:3). మంచినో చెడుగునో, పరలోకమునో లేక నరకమునో, సంతోషాన్నో లేక దుఃఖమునో ఎంచుకొనే శక్తి మనకీయబడినది. నీ విప్పుడు దేనిని ఎంచుకొనుచున్నావు ?

"కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాదు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు" (2 పేతురు 3:9).

సొదొమనుండి తప్పించుకొనే మార్గమెట్లుండెనో, అట్లే పాపఫలితమునుండి తప్పించుకొనే మార్గ మొకటున్నది. లోతు సోయరు అను ఊరిలో ఎట్లు తలదాచుకొనెనో అట్లే మనము క్రీస్తులో తల దాచుకోవలెను. ఆయన యొద్దకు పారిపోవలెను. "మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వము వ్రాయబడినవన్నియు మనకు బోధ కలుగు నిమిత్తము వ్రాయబడియున్నవని" మనము జ్ఞాపకముంచుకోవాలి (రోమా 15:4). పాపము నుండి పారిపోవుటకు సొదొమ మన కొక గొప్ప హెచ్చరికగా యుండును గాక !

— రోబర్ట్ వాలర్

## దేవునితో నిలబడుట.

## ( *Standing with the Lord* )

మానవుడు సాంఘిక జీవి, కాలారంభమునుండి మానవుడు సమాజములో జీవించుట కిచ్ఛయించుకొన్న వాడు. జంతువులు పక్షులు కూడ గుంపులుగా నివసిస్తాయి. ప్రతి మానవుడు తన స్వజనుల మధ్య నివసించడానికి కోరుకొంటాడు.

ఒంటరిగా అరణ్యములో జీవించిన కొందరిని గూర్చి బైబిలులో మనము కనుగొనగలము. ప్రవక్తయైన ఏలియా ఎక్కువ కాలము

అడవులలోనే యుండెను. దేవుడు కాకుల ద్వారా అతనికి ఆహారము పంపించుచుండెను. బాప్తిస్మమిచ్చు యోహాను ఇశ్రాయేలునకు ప్రత్యక్షమగు దినము వరకు అరణ్యములో నుండెనని మనమెరుగుదుము (లూకా 1:80). "ఈ యోహాను ఒంటె రోమముల వస్త్రమును, మొలచుట్టు తోలు దట్టియు ధరించుకొనువాడు, మిడతలును అడవి తేనెయు అతనికి ఆహారము" (మత్తయి 3:4).

తమ చుట్టుయున్న ప్రజలందరు దుష్టులును దేవునికి దూరస్థులుగ యున్న సమయంలో దేవునితో నిలిచి ఆయన నారాధించిన కొందరిని గూర్చి పాత నిబంధనలో మనము చదువగలము. ఆనాటి దుష్ట ప్రపంచములో నోవహు వేరుగా యున్నాడు. అతడొక్కడు మాత్రమే నీతిపరుడు నిందారహితుడునై యుండి యెహోవా దృష్టియందు కృప పొందిన వాడాయెను (ఆది 6 : 8, 9). జలప్రళయము ద్వారా నాటి ప్రపంచమంతా నాశనము చేయబడెనుగాని, నోవహు అతని కుటుంబము రక్షింపబడెను.

విగ్రహారాధికుల మధ్య అబ్రాహాము ఆతని కుటుంబము మాత్రమే యెహోవా దేవుని నారాధించిరి. ఫరో గృహములో యుండి దేవుని సేవించినవాడు యోసేపు ఒక్కడు మాత్రమే. కర్మెలు పర్వతముమీద బయలు దేవతయొక్కయు, అషేరా దేవియొక్కయు 850 ప్రవక్తలను ఎదుర్కొనుటకు ఏలీయా ఒక్కడు మాత్రమే నిలబడ్డాడు (I రాజులు 18). ప్రజలందరు నెబుకద్నెజరు యొక్క బంగారు ప్రతిమకు సాగిలపడుచుండగా ముగ్గురు మాత్రమే ఆ విగ్రహము నారాధించకుండ నిలబడిరి (దానియేలు 3).

క్రొత్త నిబంధనలో కూడ ప్రభువుతో ఒంటరిగా నిలబడిన కొందరిని గూర్చి చదువగలము. యేసుప్రభువు పదిమంది కుష్ఠురోగులను శుద్ధిచేయగా వారిలో ఒక్కడు మాత్రమే కృతజ్ఞత చెల్లిస్తూ ఆయన

యొద్దకు తిరిగి వచ్చాడు (లూకా 17:11-19). కైసరయ పట్టణములో అన్యజనుల మధ్య ప్రభువును సేవిస్తూ నిందారహితముగా కొర్నేలి ఒక్కడు మాత్రమే యున్నాడు (అపొ.కా. 10:1-4). వీరు తమ తమ ఫలమును పొందియున్నారు. ప్రభువుతో వారికున్న సన్నిహిత సంబంధమును బట్టి, వారి చుట్టు నున్న ప్రజలు పాపములో జీవించుచున్నను వారు ప్రభువుతో నిలబడగలిగారు.

అయితే దేవుని ప్రజల మధ్య జీవించుచుండినను పాపము చేసిన వారు కొందరుండిరి. యెహోషువ గ్రంథము 7వ అధ్యాయములో ఆకానునుగూర్చి చదువగలము. ఇశ్రాయేలు సైన్యములో అతడొక సైనికుడు. యెరికోపై దేవుడు వారికి విజయాన్నిచ్చి నప్పుడతడు అక్కడ ఉన్నాడు. ఇశ్రాయేలు మధ్య దేవుడు చేసిన ఆశ్చర్య కార్యములను గూర్చి అతడెరుగును. అయినను యెరికోనుండి శపితము చేయబడిన దానిలో కొంత తీసికొని అతడు దాచిపెట్టాడు. ఆ పాపమును బట్టి అతడును, అతని కుటుంబమును రాళ్లు రువ్వి చంపబడిరి.

దైవజనుడైన ఎలీషాకు గేహాజీ సేవకుడుగా నుండెను. ఎలీషా ద్వారా అతడు దేవుని శక్తిని తిలకించాడు. అయినను ఎలీషా నయమాను దగ్గర నిరాకరించిన బహుమతులను తన కొరకు తెచ్చుకొని రహస్యముగా ఉంచుకొన్నాడు. అతడు ఎలీషావలన శపించబడి నయమానుకు కలిగిన కుష్ఠురోగమును పొందాడు (2 రాజులు 5). క్రొత్త నిబంధనలో ఇస్కరియోతు యూదా కనబడుచున్నాడు. అతడు యేసుతో 3½ సంవత్సరములు సాంగత్యము చేసాడు. ఆయన బోధలను విన్నాడు, చేసిన మహాత్కార్యము లన్నిటిని చూచాడు. అయినను ఆయనను అప్పగించి పాపము చేశాడు. చివరకు ఉరి తీసికొని చచ్చాడు. క్రీస్తు సంఘు ఆరంభదినాల్లో క్రైస్తవులందరు ఒకే కుటుంబముగా జీవించేవారు. అపొ.కా. 5వ అధ్యాయములో అననీయ సప్పీరాలను

దంపతులను గూర్చి మనము చదువగలము. పాపము చేసినందువలన వారు తమ శిక్షను పొందారు.

ప్రజలు ప్రభువుతో యున్నను, పాపములో యున్నను తమ ఫలమును పొందియున్నట్లు చరిత్రలో మనము పదేపదే చదువగలము. నేడు కూడ ప్రజలు దేవునినుండి దూరముగ పోవుచున్నను దేవునితో నిలచి యుండువారిని మనము కనుగొనగలము. అట్లే దేవుని ప్రజలతో కలిసిమెలిసి జీవించుచున్నను పాపము చేయుచున్న వారిని మనము చూడగలము, నీవెక్కడ ఉన్నను ఆయన నిన్ను కనుగొంటాడు. "ఆయన చేట ఆయన చేతిలో ఉన్నది; ఆయన తన కళ్లమును బాగుగా శుభ్రము చేసి గోధుమలను కొట్టులో పోసి, ఆరని అగ్నితో పొట్టును కాల్చివేయును" (మత్తయి 3 : 12).

ఏలీయా వలెను, బాప్తిస్మమిచ్చు యోహాను వలెను మనము అరణ్యములో జీవించాలని గాని, విగ్రహారాధకులతో కలసి జీవించాలనిగాని ప్రభువు కోరుటలేదు. క్రీస్తునందలి విశ్వాసులందరు కలసి జీవించునట్లు ఆయన తన రాజ్యమైన సంఘాన్ని స్థాపించాడు. ప్రభువు పనిచేయుటకు ఏకమై ఒకరినొకరు పురికొల్పగలరు. ప్రభువు ప్రజలతో జీవించుట మాత్రమే సరిపోదు. నీకు నీవే బైబిలును చదువనియెడల సంఘములో జరుగు బైబిలు పఠనము సరిపోదు. ప్రార్థనా జీవితము నీకు లేనియెడల సంఘప్రార్థనలు సరిపోవు. ప్రభువుతో మన వ్యక్తిగత జీవితం బలపడాలి. అది బలముగా లేనప్పుడు దేవుని ప్రజల మధ్య జీవించుచున్నను మనము యితరులవలె పాపములో పడ్తాము. ప్రార్థన ద్వారాను, బైబిలు పఠనము ద్వారాను, పరిచర్య ద్వారాను ప్రభువుతో మనకు గల సంబంధాన్ని బలపర్చుకొని ఆయన దృష్టిలో కృప పొందుదుముగాక!

—కవిత గూటం, క్రీస్తు సంఘము, కాకినాడ-4

# ఎన్నడు ఏకాకి కాదు

## *(Never alone)*

మోషే ఇశ్రాయేలు జనాంగమునకు నాయకునిగాయున్న కష్ట కాలములో అతనికి అండగా యుండి ముందుకు నడిపించిన దేమిటి? అతని బాహుబలముగాని, ఐగుప్తు విద్యగాని గాదు. నిజానికి ఆ భారమును మోయలేక ఒకటి రెండుసార్లు నాయకత్వమునుండి విరమించుకోవాలని అతడు ప్రయత్నించాడు. "ఆయన నిన్ను విడువడు; నిన్నెడబాయడు" అను వాగ్దానము ద్వారా మోషే బలపరచబడ్డాడు (ద్వితీ 31:6).

మోషే చనిపోయినప్పుడు యెహోషువ ఇశ్రాయేలు జనాంగమునకు నాయకుడయ్యాడు. అతన్ని బలపర్చుటకుగాను దేవుడదే వాగ్దానాన్ని యెహోషువకు చేసాడు: "నేను మోషేకు తోడైయుండినట్లు నీకును తోడై యుందును. నిన్ను విడువను నిన్ను ఎడబాయను, నిబ్బరము గలిగి ధైర్యముగా నుండుము" (యెహోషువ 1 : 5,6). తనపై మోపిన భారములను మోయుటకు మోషేకు, యుద్ధములు చేయుటకు యెహోషువకు ఆ వాగ్దానములు అవసరమాయెను. ఆ వాగ్దానము వారికి పనిచేసింది !

మనందరము మోయు భారములు, చేసే యుద్ధములు లేకపోలేదు. మోషే యెహోషువలు నమ్మిన వాగ్దానమే మనమును కలిగి యున్నాము గనుక దేవునికి స్తోత్రము: "ధనాపేక్ష లేనివారై మీకు కలిగిన వాటితో తృప్తిపొంది యుండుడి. నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను అని ఆయనయే చెప్పెనుగదా" (హెబ్రీ 13:5). "ఇదిగో నేను యుగ సమాప్తివరకు సదాకాలము మీతో కూడ ఉన్నాను" అనునవి ప్రభువు తన శిష్యులతో చెప్పిన ఆఖరిమాటలు (మత్తయి 28:20).

క్రైస్తవులమైన మనము ఎన్నడు ఒంటరిగా లేము. మనము మోయవలసిన భారము లేమైనా, పోరాడవలసిన యుద్ధము లెన్ని యున్నా మన రక్షకుడు మనపక్షముననే యుంటాడు. "దేవుడు మన పక్షమున నుండగా మనకు విరోధి యెవడు?" (రోమా 8:31),

— టామ్ కెల్లన్

---

## పరిశుద్ధుడనగా యేమిటి ?

*( What is a Saint ? )*

పరిశుద్ధుడను పదము బైబిలులో పలుమార్లు వినియోగింప బడింది. ఈ రోజుల్లో మనుష్యులు ఈ పదాన్ని సరిగా వినియోగించుట లేదు, గనుక దాని భావాన్ని మనం గ్రహించుకోవాలి.

'పరిశుద్ధుడు' (Saint) అనుదాని నొక బిరుదుగా వాడరాదు. పలుమారులు పరిశుద్ధుడనే పదము ఒక బిరుదుగా మానవులకు విని యోగింపబడుట మనం చూస్తాము. ఉదా : పరి. పౌలు, పరి. పేతురు మొ॥నవి. బైబిలును ముద్రించిన వారు ఆయా పుస్తకాలను వ్రాసిన వారి పేరుకు ముందు పరిశుద్ధుడు (St.) అనే బిరుదు తగిలించుట పరిపాటి, యిది చాల పాత అలవాటు, అయితే యిది దేవునినుండి కలిగినదికాదు.

ప్రముఖ క్రైస్తవ వ్యక్తులకు మాత్రమే పరిశుద్ధుడనే పదము వినియోగించకూడదు. ఈ దిగువ నుదహరించిన రెండు అర్హతలు గల ప్రముఖ క్రైస్తవులకు మాత్రమే పరిశుద్ధుడనే పదము వాడాలని కొందరు బోధిస్తారు : 1. గొప్ప నీతిగల జీవితము జీవించిన క్రైస్తవులు 2. అధికార పూర్వకముగా పరలోకములో యున్నారని ప్రకటింప బడిన క్రైస్తవులు. ఈ బోధ బైబిలులో మాత్రము లేదు.

బైబిలు లేఖకులు 'పరిశుద్ధుడు' అను పదాన్ని ఒక ప్రత్యేక బిరుదుగా ఎన్నడు వాడలేదు. వారొకరినొకరు సూక్ష్మంగా తమ పేర్లతో సంబోధించేవారు. ఉదా : మత్తయి, పౌలు, పేతురు మొ॥నవి. అపొ.కా. 1:13, 2 పేతురు 3:15).

ప్రతి క్రైస్తవుడు పరిశుద్ధుడే. పరిశుద్ధుడనగా ప్రత్యేకముగా, పవిత్రముగా, ప్రతిష్ఠించుకొన్నవాడని యర్థము. పాతనిబంధన కాలములో దేవుని సేవ చేసినవారు పరిశుద్ధులని పిలువబడ్డారు. క్రీస్తు సంఘము స్థాపించబడినప్పుడు, క్రీస్తు శిష్యులు పరిశుద్ధులని పిలువబడ్డారు: "అందుకు అననీయ, ప్రభువా ఈ మనుష్యుడు యెరూషలేములో నీ పరిశుద్ధులకు ఎంతో కీడుచేసి యున్నాడని అతనిగూర్చి అనేకుల వలన వింటిని" అన్నాడు (అపొ.కా. 9:13). రోమా 1:7; 8:27; 1 కొరింథీ 14:33ను కూడ చూడుము. ఒకడు క్రీస్తు సువార్తకు లోబడినప్పుడు అతనిని పాపమునుండి క్రీస్తు రక్తము వేరుపరచును (ఎఫెసీ 1:7). అప్పుడతడు దేవునికి క్రీస్తుకు చెందినవాడవుతాడు. అతడు దేవుని సొత్తుగానుండుటకు ప్రత్యేకింపబడినవాడు: "మీరు మీ సొత్తు కారు, విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" (1 కొరింథీ 6:20),

బైబిలు పదములను మనము సరిగా వాడాలి. బైబిలు పదాలను సరిగా వినియోగించకపోవుటవలన మానవులు అనేక అసత్య సిద్ధాంతాలను బోధించుచున్నారు. బైబిలు లేఖకులు నీవలెను, నావలెను మానవులే; అయినను ఆయన వర్తమానాన్ని మనకిచ్చుటకు దేవుడు వారి ద్వారా పనిచేసాడు (2 తిమో 3:16, 17; యోహాను 16:12, 13; 2 పేతు 1:3, 15). ఆ వర్తమానము, వర్తమానములోని మాటలను దేవుడే ఎన్నుకొన్నాడు (1 కొరింథీ 2:13). ఏ మానవుడు లేక ఏ గుంపు కూడ పరిశుద్ధుడు అనేపదాన్ని ఒక బిరుదుగా మార్చి దానిని కొంతమందికి మాత్రమే వర్తింపజేసే అధికారాన్ని కలిగియుండలేదు. దేవునినుండి గాక మానవులనుండి కలిగిన సిద్ధాంతములను బోధించుట ఎల్లవేళల పాపమే: "ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురుగాని వారి హృద

యము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" (మత్తయి 15:7-9). "క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు; ఆ బోధయందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు" (2 యోహాను : 9-11).

మత్తయి, పేతురు, పౌలు మొదలగువారు తప్పక పరిశుద్ధులు, అట్లే నేను దేవునికి నమ్మకముగా సేవచేయు క్రైస్తవులందరును పరిశుద్ధులు. ప్రజలు పాపమునుండి బయటకువచ్చి దేవునికొరకు జీవించాలని సువార్త పిలుచుచున్నది. సువార్తకు విధేయుటగుటద్వారా ఒకడు ఆహ్వానమును అంగీకరించినప్పుడు అతడు నిజంగా పరిశుద్ధుడు.

—రోయిస్ ఫ్రెడరిక్

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*

**SATYA WAKKU**

P.O. Box. 80

KAKINADA-533 001

No.

To

..........................................

..........................................

..........................................

..........................................